నేడు మండల సర్వసభ్య సమావేశం

నార్నూర్, జూన్ 21 : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కనక మోతుబాయి అధ్యక్షతన శనివారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో జవహర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఆదిలాబాద్ ఎంపీ నగేశ్, జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి హాజరవుతున్నారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, ఆయాశాఖల అధికారులు సకాలంలో పాల్గొనాలని కోరారు.

వామపక్ష విద్యార్థి సంఘాల నేతల నిరసన

మోకాళ్లపై కూర్చోని నిరసన తెలుపుతున్న నాయకులు

ఎదులాపురం, జూన్ 21 : నీట్‌లో అవకతవకలపై ఆదిలాబాద్‌లో వామపక్ష విద్యార్థి సంఘాల నేతలు ఆగ్రహించారు. ఆదిలాబాద్‌లోని కుమ్రం భీం విగ్రహం వద్ద శుక్రవారం మోకాళ్లపై కూర్చోని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీపై చర్యలు తీసుకొని, నీట్ పరీక్షలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మెస్రం భాస్కర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి గేడం కేశవ్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి గణేశ్, ఏఎస్‌యూ జిల్లా కార్యదర్శి సలాం వరుణ్, పీడీఎస్‌యూ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కుమ్ర అశోక్, పీవైఎల్ మెస్రం మారుతి, పీడీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.

పదోన్నతుల కోసం నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయులు..

నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఉట్నూర్, జూన్ 21: గిరిజన ఉపాధ్యాయుల షెడ్యూల్ రాకపోవడంతో పదోన్నతులు ఇవ్వడం లేదని టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు స్థానిక పాఠశాలలో భోజన విరామంలో శుక్రవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆత్రం భుజంగ్ మాట్లాడుతూ, గిరిజన ఉపాధ్యాయులకు జరుగుతున్న అన్యాయంపై రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన కార్యక్రమం తెలిపామన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో సవరించిన సర్వీసు రూల్స్‌ను వెంటనే ప్రకటించాలని, బదిలీలు, పదోన్నతులు షెడ్యూల్‌ను విడుదల చేయాలని, కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలల పోస్టులను మంజూరు చేయాలని, పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులను పాఠశాల సహాయకులుగా ఉన్నతీకరించాలని, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పోస్టులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మడావి ధన్ను, సంతోష్, అభిమాన్, మూగ శ్రీనివాస్, సంతోష్, రమేశ్, తులసీదాస్ పాల్గొన్నారు.

శభాష్.. వెంకటేశ్

రోడ్డుపై యువకుడిని కాపాడుతున్న కానిస్టేబుల్

నిర్మల్ అర్బన్, జూన్ 21: రోడ్డుపై గిలగిల కొట్టు కుంటున్న ఓ యువకుడి ప్రాణాలను ఎక్సైజ్ కానిస్టేబుల్ కాపాడాడు. భైంసాకు చెందిన శ్రీరామ్ పని నిమిత్తం శుక్రవారం నిర్మల్‌కు వచ్చాడు. ఆర్డీవో ఆఫీస్ ఎదుట రోడ్డు పక్కన నిల్చున్న ఆయన అకస్మాత్తుగా పడిపోయాడు. అటువైపు వెళ్తున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ వెంకటేశ్ గమనించి వచ్చాడు. కాలికి ఉన్న షూలను తొలగించి కాళ్లు చేతులను తుడిచాడు. నోటిలో నుంచి నురగలు రావడంతో ఫిట్స్ వచ్చినట్టు గమనించి ప్రాథమిక చికిత్స అందించాడు. యువకుడు కోలుకోవడంతో 108 అంబులెన్స్‌లో దవాఖానకు తరలించారు.

ఆరు గ్యారెంటీల అమలెప్పుడు ?

మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాస్

బోథ్, జూన్ 21 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు ఎప్పుడు అమలు చేస్తారని బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ ప్రశ్నించారు. శుక్రవారం జడ్పీ సమావేశంలో సమస్యలు లేవనెత్తారు. వానకాలం సీజన్ మొదలైన రైతులకు రైతు భరోసా అందించలేదన్నారు. రూ.2 లక్షల రుణమాఫీని రైతులందరికీ వర్తింపజేయాలన్నారు.

జిల్లా వాసులకే ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు ఇవ్వాలి

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 21 : నిర్మల్ జిల్లా ఏజెన్సీలకే జిల్లా ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల బాధ్యతలు అప్పగించాలని కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బానవత్ గోవింద్‌నాయక్, నాయకులు శుక్రవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇక్కడ జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు సూర్యకాంత్ కాంబ్లే, పట్టణ కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు రాథోడ్ అంబాజీ ఉన్నారు.

ఐటీడీఏ మహాధర్నాను విజయవంతం చేయాలి

బోథ్, జూన్ 21 : షెడ్యూల్ ప్రాంతంలో మెగా స్పెషల్ డీఎస్సీ ఏర్పాటు చేయాలని, ఐటీడీఏలో బ్యాగ్ లాక్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24వ తేదీన చేపట్టిన చలో ఉట్నూర్ ఐటీడీఏ మహా ధర్నాను విజయవంతం ఐటీడీఏ పాలకవర్గం మాజీ డైరెక్టర్ మెస్రం భూమన్న పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు మారుతి తదితరులు పాల్గొన్నారు.

విధులకు హాజరు కాని సీఆర్పీపై చర్యలు తీసుకోవాలి

తాంసి, జూన్ 21: విధులకు హాజరుకాని తాంసి, పిప్పల్‌కోటి క్లస్టర్ సీఆర్పీలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నగరం అశోక్, మండల కార్యదర్శి రాముతో కలిసి తాంసి, భీంపూర్ మండలాల విద్యాధికారి శ్రీకాంత్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై వెంటనే స్పందించాలని కోరారు.

PUBLIC NOTICE

All the general public hereby informed that **Shaik Akbar S/o.Sharipoddin Occ:Business, R/o.H.No. 4-1-140, Vishwanathpet-Nirmal, Dist.Nirmal Telangana State** intended to deposit his title deeds of the over the property of the open Place of dismantled house bearing No.5-13-1/2 (Part), admeasuring 4371 Sq.feet=485.66 Sq.yards =406.07 sq.meters situated at vishwanathpet, under limits of municipality Nirmal, Dist.Nirmal Telangana State which is bounded by East: Ganesh Temple West: 150' wide road, North: remaining part in H.No.5-13-1/2 of Chilamanthula Raja Lingam, South: Land of Dasu. At Present **Shaik Akbar S/o.Sharipoddin** is intended to create **EQUITABLE MORTGAGE** in favour of M/s.Shriram Finance Ltd., Branch: Nirmal for the purpose of Small & Medium Enterprises loan.

As such if any person or persons have any interest or any other right or title over the said property can furnish their objections if any, for the said creation of mortgage, and if they have any claims with regard to title and have any documents related to the said property also can file and furnish the same at my office within a week days time from the publication of this notice. If any objections pertains to the said property raised after the said stipulated time, shall not be entertained and considered. Hence this notice.

Sd/- J.KRISHNA MOHAN RAO, Advocate
H.no1-3-458, Shastrinagar, South Nirmal
Nirmal 504106, Cell: 9959298938

గర్భిణులకు వైద్య పరీక్షలు

తాంసి(భీంపూర్), జూన్ 21 : భీంపూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అందర్‌బంద్ ఉప కేంద్రంలో వైద్యాధికారి నిఖిల్‌రాజ్ 16 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రత్న ప్రభ మాట్లాడుతూ సంపూర్ణ పోషకాహారం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తీర్ణాధికారి లింగంపల్లి జ్ఞానే శ్వర్, పర్యవేక్షకులు గంగాధర్, స్టాఫ్ నర్స్ పూర్ణిమ, ఫార్మాసిస్టు విలాస్, ప్రయోగశాల నిపుణుడు సంతోష్, ఆరోగ్య కార్యకర్త విజయ లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

జయశంకర్ సార్ సేవలు చిరస్మరణీయం

- బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్
- నివాళులర్పించిన నాయకులు, కార్యకర్తలు

ఉట్నూర్‌రూరల్: జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్, నాయకులు

ఉట్నూర్ రూరల్, జూన్ 21: తెలంగాణ సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ అందించిన సేవలు చిరస్మరణీయమని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ పేర్కొన్నారు. ఉట్నూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో శుక్రవారం జయశంకర్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బాబాశ్యాం, ముజీబ్, మహేందర్, సాజీద్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గంగన్నపేట్ గ్రామంలో...

గంగన్నపేట్ గ్రామంలో జయశంకర్ చౌక్‌లో నేతకాని సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తపెల్లి మహేందర్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి, నేతకాని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దూట మహేందర్, తొడసం రాధాబాయి, కొరుట రాజమ్మ, ముంజం గంగేశ్వర్, గవాస్కర్, నర్సయ్య, ఆశన్న, గంగాధర్, ప్రభాకర్, మహేశ్, లక్ష్మణ్, అర్జున్, శాంతాబాయి, సూర్యాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బోథ్, జూన్ 21 : ప్రొఫెసర్ కొత్తపెల్లి జయశంకర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీఆర్ఎస్ నాయకుడు మల్లెపూల సుభాష్ అన్నారు. పట్టణంలో ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు సోలంకి సత్యనారాయణ, బీసీ సెల్ అధ్యక్షుడు బుచ్చన్న, పొచ్చెర గ్రామాధ్యక్షుడు పన్నాల శామేందర్ రెడ్డి, షేక్ జాబీర్, భీంరావ్, ఖాదర్, అచ్యుతరావ్ పాల్గొన్నారు.

నిర్మల్‌లో..

నిర్మల్ అర్బన్, జూన్ 21: నిర్మల్‌లోని రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద గల ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నిర్మల్ నియోజక వర్గ సమన్వయకర్త కొరిపెల్లి రాంకిషన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము, అక్రం అలీ, పూదరి నరహరి, మహ్మద్ బిన్ అలీ, నహీం, రిజ్వాన్‌ఖాన్, అనిల్, దేవేందర్ గౌడ్, మసూద్, విశాల్, హరీశ్, సాజీద్, సోహెల్ పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల, సంఘాల ఆధ్వర్యంలో....

నిర్మల్‌లో పలు రాజకీయ, ఇతర కుల సంఘాల ఆధ్వర్యంలో జయశంకర్ వర్ధంతి నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి రావు, బీసీ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ కృష్ణంరాజు, జేఏసీ ఉమ్మడి జిల్లా కన్వీనర్ కొట్టె శేఖర్, నిర్మల్ మున్సిపల్ ఆధ్వర్యంలో ఈశ్వర్ జయశంకర్ విగ్రహానికి పూలమాల లు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

భైంసాలో..

భైంసా, జూన్ 21: పట్టణంలోని జయశంకర్ కాలనీలో పలువురు జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్వర్ణకార సంఘం అధ్యక్షుడు బెజ్జంకి రవి, జేఏసీ నాయకులు డా. రామకృష్ణగౌడ్, డా. మోహన్, విశ్వబ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి సాగర్, కోశాధికారి అశోక్, శ్రీనివాస్, వెంకటేశ్, దశరథ్, అవదూత్ పటేల్, డా. రామకృష్ణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో

ఖానాపూర్, జూన్ 21: పట్టణంలోని తెలంగాణ చౌరస్తాలో పలు కుల సంఘాల నాయకులు ఆచార్య కొత్తపెల్లి జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఖానాపూర్: ఆచార్య జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నిర్మల్‌అర్బన్: జయశంకర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బోథ్‌లో..

భైంసాలో..

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఉట్నూర్: యోగా చేస్తున్న డీడీ దిలీప్ కుమార్, అధికారులు

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, క్రీడా మైదానాల్లో, పార్టీ కార్యాలయాల్లో, పాఠశాలల్లో, ఉద్యోగులు, క్రీడాకారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు యోగసనాలు వేశారు. యోగా శిక్షకులు యోగసనాల వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు.

బాసర: ట్రిపుల్‌ఐటీలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

నిర్మల్‌లో ప్రధాన న్యాయమూర్తి కర్ణ కుమార్, డీఈవో రవీందర్ రెడ్డి, ఉట్నూర్‌లో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు దిలీప్ కుమార్, బోథ్‌లో జూనియర్ సివిల్ జడ్జి బీ హుస్సేన్, భైంసాలో న్యాయమూర్తి దేవేంద్ర బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ గంగాధర్, కుభీర్‌లో బీఆర్ఎస్ ఉద్యమ నాయకుడు పుప్పాల పీరాజీ, తదితరులు పాల్గొన్నారు.

- నమస్తే, నెట్‌వర్క్

నీట్ పరీక్ష లీకేజీకి బాధ్యులపై విచారణ చేపట్టాలి

నిర్మల్ అర్బన్: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిర్మల్ అర్బన్, జూన్ 21: నీట్ పరీక్ష లీకేజీకి బాధ్యులైన వారిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని నిర్మల్‌లోని ఆర్డీవో కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి, ప్రధానమంత్రి మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఆర్డీఓ రత్న కళ్యాణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీ హరిరావు మాట్లాడుతూ బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే లీకేజీ జరిగిందని, విద్యార్థుల జీవితాలతో కేంద్రప్రభుత్వం ఆటలాడుతుందని మండిపడ్డారు. వెంటనే పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, రాజేందర్, రామేశ్వర్ రెడ్డి, సాద సుదర్శన్, నాందేడపు చిన్ను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనర్హత వేటు వేయాలి

భైంసా, జూన్ 21 : నీట్ పరీక్ష ప్రశ్నపత్రం కొనుగోలు చేసిన వారిని జీవితాంతం ఏ పరీక్షలు రాయకుండా అనర్హత వేటు వేయాలని సామాజిక కార్యకర్త జాదవ్ పుండలిక్ రావు పాటిల్ డిమాండ్ చేశారు. ధన బలంతో లక్షలాది రూపాయలు పెట్టి పరీక్షా పత్రాలను కొనుగోలు చేస్తే ఆర్థికంగా వెనుకబడి ఉన్న విద్యావంతులు నష్టపోతారని ఆయన తెలిపారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే సీబీఐ చే విచారణ జరిపించి దోషులను గుర్తించి అనర్హత వేటు వేయాలని ఆయన తెలిపారు.

మిషన్ భగీరథ సర్వే సక్రమంగా నిర్వహించాలి

ఇంద్రవెల్లి, జూన్ 21 : గ్రామాల్లో నిర్వహిస్తున్న మిషన్ భగీరథ పథకం సర్వేతో పాటు ఆన్‌లైన్ నమోదు వివరాలు ఎంబీ యాప్‌లో నమోదు చేయాలని ఎంపీడీవో భాస్కర్ అన్నారు. శుక్రవారం ఇంద్రవెల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాలతో పాటు వార్డుల్లో మిషన్ భగీరథ సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీవో జీవన్‌రెడ్డి, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ భానుకుమార్, ఈవో సంజీవరావ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ఖానాపూర్ టౌన్, జూన్ 21 : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని కాంప్లెక్స్ హెచ్‌ఎం సంధ్యారాణి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పాత బస్టాండ్‌లో గల ప్రాథమిక పాఠశాలలో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి తరగతులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీఎంజేజేబీవై చెక్కు అందజేత

పెంబి, జూన్ 21: అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన పథకాలను వినియోగించుకోవాలని పెంబి ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ సంతోష్‌కుమార్ అన్నారు. కొద్ది రోజుల క్రితం చెరువులో పడి షేక్ అమీర్ మృతి చెందాడు. బాధిత కుటుంబానికి శుక్రవారం ప్రధానమంత్రి బీమా పథకం ద్వారా మంజురైనా రూ. 2 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ ప్రసన్న కుమార్, సిబ్బంది శేఖర్, నవీన్, సాయి, రాజు, సీఎస్‌పీ రవి పాల్గొన్నారు.

23న ఒలింపిక్ డే రన్

ఎదులాపురం, జూన్ 21 : ఆదిలాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఈ నెల 23వ తేదీన ఒలింపిక్ డే రన్‌ను నిర్వహించనున్నట్లు ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, కన్వీనర్ పార్థసారథి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 7 గంటలకు రన్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కావున జిల్లాలోని క్రీడా సంఘాల బాధ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, క్రీడా అభిమానులు సకాలంలో పాల్గొనాలని కోరారు.

సెల్ ఫోన్లు అందజేత

బాధితులకు ఫోన్లు అందజేస్తున్న ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, జూన్ 21 : సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న, చోరీకి గురైన 10 సెల్‌ఫోన్లను శుక్రవారం జిల్లా పోలీస్ ముఖ్య కార్యాలయంలో బాధితులకు ఎస్పీ గౌష్ ఆలం అందజేశారు. ఇందులో ఆదిలాబాద్ రూరల్, మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని పీ సాయికిరణ్, ఏ మాధవి, ఎం నర్సయ్య, వీ శైలత, కే రహీం, గణేశ్(బీహార్ నుంచి ఫోన్ రికవరీ), బేల పోలీస్ స్టేషన్ పరిధిలో ఓంకార్, బీ గణేశ్, బోథ్ పోలీస్ స్టేషన్ పరిధిలో విజయ్ , రవి ప్రహ్లాద్‌లకు అప్పగించారు. ఎస్పీకి కృతజ్ఞతలు తెలియజేస్తూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ డీసీఆర్బీ కే సురేందర్ రెడ్డి, సీఐలు ఫణిదర్, శ్రీనివాస్, సైబర్ సెల్ సిబ్బంది సంజీవ్ కుమార్, రియాజ్, స్టేషన్ సిబ్బంది శరత్, రాంప్రసాద్, ఇస్మాయిల్, ప్రజా ఫిర్యాదు విభాగం అధికారి జైస్వాల్ కవిత పాల్గొన్నారు.

కాళేశ్వరం 27, 28 ప్యాకేజీలను త్వరగా పూర్తి చేసేలా చూడాలి



ఇంజినీర్‌తో మాట్లాడుతున్న ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసా, జూన్ 21 : హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్‌ను ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ శుక్రవారం తన కార్యాలయంలో కలిసి కాళేశ్వరం 27, 28 ప్యాకేజీలను త్వరగా పూర్తి చేయాలని, అంతేగాకుండా గుండేగాం ముంపు గ్రామ బాధితులకు నష్టపరిహారం అందించి, సిరాల ప్రాజెక్టు పనులు తొందరగా పూర్తి చేసేలా చూడాలని విన్నవించారు. ఆయన వెంట నాయకులు సాంవ్లీ రమేశ్, తదితరులు ఉన్నారు.

మంత్రి కొండా సురేఖను కలిసిన మాజీ ఎమ్మెల్యే



మంత్రిని కలిసిన మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

భైంసా, జూన్ 21 : హైదరాబాద్‌లోని డా. బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సెక్రటరీయేట్‌లో రాష్ట్ర అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ముథోల్ నియోజకవర్గంలో ఇప్పటికే కొన్ని దేవాలయాలకు నిధులు మంజూరు చేయడం జరిగిందని వాటికి టెండర్లు పిలవాలని, టెండర్లు పూర్తయిన వాటికి పనులు ప్రారంభించడానికి ఆదేశాలు జారీ చేయాలని, పనులు జరుగుతున్న వాటికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

రిజర్వేషన్లు కల్పించాలి

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 21 : 2016 చట్ట ప్రకారంగా ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలని తెలంగాణ దివ్యాంగుల పునరావాస అభివృద్ధి ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సట్టి సాయన్న పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ అభిలాష అభినవ్‌ను సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల్లో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీఆర్‌డీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్, నాయకులు మధుకర్ ఉన్నారు.

అడవి పంది దాడిలో ఒకరికి గాయాలు

బోథ్, జూన్ 21: బోథ్ మండలం నారాయణపూర్ (మైసంపల్లె) గ్రామానికి చెందిన ఆడె సతీశ్ అనే యువ రైతుకు అడవి పంది దాడిలో తీవ్ర గాయాలయ్యాయి. గురువారం సాయంత్రం తన పత్తి చేనులో అరక పనులు చేస్తుండగా వెనుక వైపు వచ్చిన అడవి పంది సతీశ్‌పై దాడి చేసింది. క్షతగాత్రుడిని బోథ్ సీహెచ్‌సీకి తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు.

వ్యవసాయ బావిలో పడి ఒకరి మృతి

హన్వతే మిలింద్(ఫైల్)

ఇంద్రవెల్లి, జూన్ 21: ఇంద్రవెల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని భీంనగర్‌కు చెందిన హన్వతే మిలింద్(35) వ్యవసాయ బావిలో పడి మృతి చెందినట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు. శుక్రవారం కుటుంబీకులు, ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. భీంనగర్‌కు చెందిన హన్వతే మిలింద్ కొంతకాలం నుంచి ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నాడు. పలు దవాఖానల్లో వైద్యం అందించిన వ్యాధి తగ్గలేదు. ఈ నెల 16న ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించి వైద్యం అందిస్తుండగా ఎవరికి తెలియకుండా దవాఖాన నుంచి ఇంటికి వచ్చాడు. 17న రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన మిలింద్ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో మండల కేంద్రంలోని చుట్టు పక్కల బంధువుల ఇండ్లలో వెతికిన ఆచూకీ లభించలేదు. శుక్రవారం మండల కేంద్రంలోని ఓ వ్యవసాయ చేనులోని బావిలో మృతదేహాన్ని గమనించిన పలువురు వ్యవసాయ కూలీలు పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ సునీల్ సంఘటన స్థలానికి చేరుకొని మిలింద్ మృతికి గల కారణలు అడిగి తెలుసుకున్నారు. ఫిట్స్ వచ్చిన సమయంలో బావిలో పడి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. మృతుడి తండ్రి హన్వతే దోండిబా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య సుజాత ఉన్నారు.

దుబాయిలో చిట్యాల్ వాసి అదృశ్యం

కస్తూరి చందు

సోన్, జూన్ 21: నిర్మల్ మండలం చిట్యాల్ గ్రామానికి చెందిన కస్తూరి చందు (19) దుబాయిలో అదృశ్యమైనట్లు ప్రవాస మిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశీ పరికిపండ్ల తెలిపారు. చందు ఈనెల 14న ఉపాధి కోసం దుబాయికి వలస వెళ్లాడు. 16వ తేదీన అర్ధరాత్రి అందరూ నిద్రించిన తర్వాత తన గది నుంచి బయటకు వెళ్లిపోయాడు. ఆ రాత్రి గది నుంచి తానే బయటకు వెళ్లాడా, ఎవరైనా తీసుకెళ్లారా అనే విషయాలు తెలియలేదు. దీంతో తానాలో మిస్సింగ్ కేసు నమోదు చేయించారు. ఎంబసీకి వివరాలు అందించారు. ఈ విషయం చిట్యాల్‌లో ఉన్న కుటుంబ సభ్యులకు తెలుపగా వారు ప్రవాసమిత్ర లేబర్ యూనియన్ వలంటీర్ ఏనుగు సాయిరాజుకు సమాచారం అందించారు. అనంతరం లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశీ పరికిపండ్లను కలిసి పూర్తి వివరాలు తెలుపగా వారు దుబాయిలోని ఎంబసీకి పూర్తి నివేదికను పంపించారు. శుక్రవారం వరకు అతడి ఆచూకీ తెలియలేదని చందు తండ్రి శేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు.

హరితహారాన్ని విజయవంతం చేయాలి

మాట్లాడుతున్న ఎంపీడీవో లక్ష్మణ్

ఇచ్చోడ, జూన్ 21 : వర్షాకాలం నేపథ్యంలో హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ ఐదేసి మొక్కలు పంపిణీ చేయాలన్నారు. మిషన్ భగీరథ నీరు అందరికి అందే విధంగా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీవో సాయిప్రసాద్, ఉపాధి హామీ ఏపీవో నరేందర్‌గౌడ్, ఈజీఎస్ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

నార్నూర్, జూన్ 21 : పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని ఆరోగ్య పర్యవేక్షకుడు చౌహాన్ చరణ్‌దాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని గుంజాల సోంజిగూడలో డ్రై డే నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ వాటర్ డబ్బాలు, డ్రమ్ములు, కొబ్బరి బొండాలు, కూల్లర్లలో లార్వా పట్టిన కలుషిత నీటిని పారబోశారు. శుభ్రతపై అవగాహన కల్పించారు. ఇక్కడ వైద్య సిబ్బంది హిమబిందు, ఈశ్వరి, ఆశకార్యకర్త నాగుబాయి ఉన్నారు.

పంటల ప్రణాళిక ప్రకటించాలి

పెంబి, జూన్ 21 : వానకాలం సీజన్ ప్రారంభమై రైతులు విత్తనాలు విత్తుకుంటున్న పంటల ప్రణాళికను ప్రకటించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు మంచికంటి లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు, రుణమాఫీ చేస్తామని బోగస్ వాగ్దానాలు చేసిందన్నారు. నకిలీ విత్తనాలు, పురుగుల మందు చాట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని డిమాండ్ చెశారు. కార్యక్రమంలో రైతులు, నాయకులు పాల్గొన్నారు.

మహిళ పై అసభ్యంగా ప్రవర్తించిన పలువురిపై కేసు

కడెం, జూన్ 21: మండలంలోని పెద్ద బెల్లాల్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఉప్పరి గుడెం గ్రామానికి చెందిన ఓ మహిళపై అసభ్యంగా ప్రవర్తించిన ఆదే గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీకి చెందిన ముగ్గురు వ్యక్తులు వారితో పాటు మరో ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు కడెం ఎస్ఐ కృష్ణ సాగర్ రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... ఉప్పరి గుడెం గ్రామానికి చెందిన మహిళ సమీప చెరువు కట్ట నుంచి ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్తున్న సమయంలో మత్తు పానీయాలు సేవించి ఉన్న ఆరుగురు వ్యక్తులు ఆమెపై దురుసుగా ప్రవర్తిస్తూ వెంబడించారు. దీంతో సదరు మహిళ వారి బంధువులకు ఫోన్‌లో సమాచారం అందించింది. వెంటనే సంఘటన స్థలానికి వచ్చిన వారి బంధువులపై చేయిచేసుకొని మహిళను అసభ్య పదజాలంతో దూషిస్తూ అత్యాచారానికియత్నించినట్లు ఆయన తెలిపారు. ఈ క్రమంలో ఆకతాయిల నుంచి తప్పించుకున్న ఆ మహిళ, కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన బీజేపీ నాయకులు



కలెక్టర్‌కు పూలమొక్కను అందజేస్తున్న నాయకులు

నిర్మల్ అర్బన్, జూన్ 21 : నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అభిలాష అభినవ్‌ను శుక్రవారం బీజేపీ నాయకులు కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ బీజేపీ నాయకులు అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్, రాజు, శ్రావణ్ రెడ్డి, అంజుకుమార్ రెడ్డి, సాదం అరవింద్ ఉన్నారు.